క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



దేవరకద్ర: జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సోమవారం వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో సీనియర్స్ విభాగంలో జెడ్పీహెచ్‌ఎస్ చెందిన అలేఖ్య, వేముల అఖిల, వెంకటేశ్వరమ్మ శ్రావణి, జూనియర్స్ విభాగంలో స్వప్న, తులసి విజేతలుగా నిలిచారు. ఉపన్యాస పోటీలలో చైత్ర, మణికంఠ, శ్రీజ, శ్రీవాణి, అభిజ్ఞాన్, గౌతమి, శివశంకర్ గెలుపొందారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లచ్చయ్య, లక్ష్మీకాంత్, సత్యనారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేపు టీవీఎస్ జిల్లా కమిటీ సమావేశం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): తెలంగాణ వికలాంగుల సమితి జిల్లా కమిటీ సమావేశం ఈనెల 25వ తేదీన స్థానిక స్టేషన్ ఏరియాలోని ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు నర్సింహులు సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

26 నుంచి పగిడ్యాల్ జాతర

గండేడ్: పగిడ్యాల్ కృష్ణబ్రహేంద్ర స్వామి జాతర ఈనెల 26 నుంచి నిర్వహించనున్నట్లు సర్పంచ్ రాణి తెలిపారు. 26న సాయంత్రం పల్లకీసేవ, 27న అఖండ భజన, నందికోల సేవా, 28న ఉదయం సాధుపూజ, పాదుక పూజ, గంగాస్నానం, మధ్యాహ్నం అన్నదానం రాత్రి 9గంటలకు స్వామి వారి డోలారోహణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం కొబ్బరికాయలు, తలనీలాలు, లడ్డుప్రసాదాలకు వేలం నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

దేవరకద్ర: పట్టణంలోని 5, 6 వ వార్డులకు చెందిన వంద మందికి పైగా కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. అన్నాసాగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన వారందకి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జట్టి నర్సింహారెడ్డి, వెంకట్రాములు, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రాజు, సత్యం, రాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందజేత

భూత్పూర్: మండలంలోని కర్వెన ఉన్నత పాఠశాలకు సోమవారం రూ.5వేల విలువ గల రెండు షాట్‌పుట్లు, హై జంప్ క్రీడా సామాగ్రిని ధన్వాడ మండల ఉర్దూ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న లక్ష్మణ్ అందజేశారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీఆర్టీయూ నూతన సంవత్సర డైరీని సోమవారం కలెక్టర్ వెంకట్రావ్ ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రస్తుతం చేపట్టబోతున్న ఉపాధ్యా య బదిలీ, పదోన్నతులలో సీనియార్టీ జాబితా తయారు చేయడంలో ఎటువంటి తప్పులు లేకుండా ప్రక్రియ సజావుగా సాగే విధంగా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో 8 కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాలకు 13శాతం హెచ్‌ఆర్‌ఏ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడంతో స్పందించిన కలెక్టర్ అందుకు జిల్లా అధికారులకు ఆదేశాలకు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్, రఘురాంరెడ్డి, గోపాల్‌నాయక్, బుచ్చిరెడ్డి, పురుషోత్తం, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మచెరువును శుద్ధి చేయండి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని పోచమ్మ చెరువులో మురుగు వదలటం వల్ల కలుషితమైందని,వ వెంటనే శుద్ధి చేయాలని జనతా సోషల్ సరీ్వసెస్ సభ్యులు కమిషనర్ మహమూద్‌షేక్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. మురుగు చెరువులోకి వదలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. చెరువు పరిశుభ్రంగా ఉండటం వల్ల పాతబజార్, పద్మావతి కాలని, క్లబ్ ప్రాంతం బోర్లలో పుష్కలంగా నీళ్లు ఉంటాయని వారు తెలియజేశారు. స్పందించిన కమిషనర్ చెరువును బాగుచేయిస్తామని, మురుగు వెళ్లకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు సభ్యులు తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

జడ్చర్ల: స్థానిక క్లబ్ ఏరియాలో సోమవారం అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వడ్డెరాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేతాజీకి ఘన నివాళి



ఎన్‌వైకే కార్యాలయంలో..

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశాన్ని ఒక సమైక్య జాతిగా నిలబెట్టడం కోసం కృషి చేసిన మహానీయుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అని తెలంగాణ ఉద్యమ సామాజికవేత్త హనీఫ్ అహ్మద్ అన్నారు. ఎంఆర్‌జేఏసీ, టీఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో సోమవారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ నేతాజీ ఏర్పాటు చేసిన ఆజాద్‌హింద్ ఫౌజ్‌లో అనేక మంది ముస్లింలు, హిందువులు, సిక్కులు ఉన్నతమైన పదవుల్లో కమాండ్ స్థాయిలో ఉన్నారని గుర్తుచేశారు. మతాలకతీతంగా భారతదేశాన్ని ఒక జాతిగా ప్రగతి పథంలో నడిపించడమే సుభాష్‌చంద్రబోస్‌కు నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో రాఘవాచారి, ఖలీల్, విజయ్‌కుమార్, నిజాముద్దీన్, జలాల్‌పాష, భూషణ్, నర్సింహ, జైపాల్, నూరుల్ హసన్, ఆమేర్, సోహైల్, ముఖ్తార్, మహ్మద్ జహంగీర్, సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ ఆశయాలను కొనసాగిద్దాం

నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆశయాలను కొనసాగించేందుకు మరో సారి కంకణబద్ధులం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నేతాజీ జీవితం యువతకు ఆదర్శం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో సోమవారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు యువకులు ఘనంగా నివాళులర్పించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, శెట్టిశ్రవన్, శ్రీనివాస్, అర్షద్, వంశీ, శేఖర్, అన్వర్, నారాయణ, ప్రసాద్, సలాం తదితరులు ఉన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా బస్టాండ్ వద్ద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో శేఖర్, అరవింద్, శివ, ప్రేమ్, శ్రీరామ్, చరణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌తో పాటు మండలంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని విగ్రహానికి తహసీల్దార్ చెన్న కిష్టన్న పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సాయిలు, రామకృష్ణ, అజీజ్ ఉన్నారు.



జడ్చర్లలో నివాళి అర్పిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్, మున్సిపల్ చైర్‌పర్సన్



జిల్లా కేంద్రంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఘనంగా పరాక్రమ దివాస్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్‌వైకే కార్యాలయంలో పరాక్రమ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా కోఆర్డినేటర్ కోటానాయక్ మాట్లాడుతూ నేతాజీ ఆశయాలను నేటి యువతకు పరిచయం చేయాలన్నారు.

యువత అడుగులు వేయాలి

జడ్చర్ల టౌన్: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ స్ఫూర్తిగా యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని జెడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం బాదేపల్లి పట్టణం నేతాజీ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ట్రేడ్‌యూనియన్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కావేరమ్మపేట చావిడి వద్ద ఉన్న విగ్రహానికి యువజన సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



మూసాపేటలో..



మిడ్జిల్‌లో..



భూత్పూర్ మున్సిపాలిటీ అమిస్తాపూర్‌లో..

సౌకర్యాలు వినియోగించుకోండి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లక్ష్మి

జడ్చర్ల టౌన్: ప్రభుత్వం బాలికలు, మహిళలకోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని నక్కలబండతండా ప్రాథమిక పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. బాల్యవివాహాలు చేసుకోరాదని సూచించారు. బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చైతన్య చౌహాన్, హెచ్‌ఎం సంధ్యాలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరాల తనిఖీ

హన్వాడ: మండలంలోని కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాలను మండల కమిటీ సోమవారం పరిశీలించింది. కంటి పరీక్షలకు వచ్చిన వారితో మాట్లాడారు. వసతులు, ఏర్పాట్లు, వైద్యసేవల గురించి ఆరా తీశారు. కంటి పరీక్షలు చేసుకున్న వారిలో 120 మందికి కంటి సంబంధ వ్యాధులు ఉన్నట్లు గుర్తించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ ధనుంజయ్‌గౌడ్, సర్పంచ్ రేవతి పాల్గొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంతో పాటు కొల్లూర్, లింగన్నపల్లిలో సోమవారం నిర్వహించిన కంటివెలుగు శిబిరంలో 588 మందికి పరీక్షలు చేసినట్లు మండల వైద్యాధికారి విజయలక్ష్మి తెలిపారు. నవాబుపేటలో 209, కొల్లూర్‌లో 188, లింగన్నపల్లిలో 171 మందికి పరీక్షలు చేశారు. 62 మందికి కంటి అద్దాలు అందించామని తీవ్రత ఉన్న 21 మందికి అద్దాల కోసం ఆర్డర్ చేశామన్నారు. 51 మందికి ఆపరేషన్లు అవసరం ఉందని తెలిపారు.

భూత్పూర్: కంటివెలుగులో భాగంగా సోమవారం 504 మందికి కంటి పరీక్షలు చేసినట్లు సీహెచ్‌ఓ రామయ్య తెలిపారు. మండలంలోని హస్నాపూర్, మున్సిపాలిటీలోని నర్సింగాపూర్‌లో 504 మందికి కంటి పరీక్షలు చేయగా 47 మందికి ఆపరేషన్ కోసం రెఫర్ చేయగా, 52 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు చెప్పారు.

వాసవీమాత ఆత్మార్పణ పూజలు



జిల్లా కేంద్రంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



దేవరకద్రలో సామూహిక కుంకుమార్చన, లలితా పారాయణం చేస్తున్న మహిళలు

స్టేషన్ మహబూబ్‌నగర్: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లాకేంద్రం బ్రాహ్మణవాడిలోని వాసవీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవోపా ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. వాసవీ, వనితా క్లబ్‌లకు చెందిన 50 మంది సభ్యులు వాసవీ మాలధారణ (వాసవీ దీక్ష) చేపట్టారు. ఒకేసారి 108 మహిళలు అమ్మవారికి మంగళహారతులు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు గొండ్యాల రాఘవేంద్రశర్మ వాసవీమాత త్యాగవిశిష్టత గురించి వివరించారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో సోమవారం ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పంచామృతాభిషేకం, సామూహిక కుంకుమార్చన, లలితా పారాయణం చేపట్టారు.

జడ్చర్ల టౌన్: మండల కేంద్రంలోని సాయినగర్ సకలదేవతల ఆలయంలోని వాసవీమాత ధ్వజారోహణం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, గోపూజ చేసి అలంకారాభిషేకం చేశారు. హోమం చేసి మహామంగళహారతి నివేదించారు. స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవి, వనితాక్లబ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. హోమాలు, పారాయణం, పల్లకీసేవ, అన్నదానం చేశారు.

గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలి

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్ మండల సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. దీక్షకు బీజేపీ నాయకుడు ఎన్‌పీ వెంకటేష్ హాజరై మద్దతు పలికారు. 44 పంచాయతీలలో అతిపెద్ద మండలంగా ఉన్న కోయిల్‌కొండను రెండవ మండలంగా గార్లపహాడ్‌ను చేయడం ద్వారా పరిసర గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. వెంటనే ప్రభుత్వం గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం కొత్త మండలం ఏర్పాటు కోసం అదే గ్రామానికి చెందిన సత్తిరెడ్డి ఎకరా భూమి విరాళంగా ఇవ్వడంపై వారు అభినందించారు. కార్యక్రమంలో రామునాయక్, వెంకట్రామిరెడ్డి, రవినాయక్, ఓబ్యానాయక్, నవీన్, దస్తగిరి పాల్గొన్నారు.



రిలేదీక్షలో మాట్లాడుతున్న ఎన్‌పీ వెంకటేష్

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



అడ్డాకుల: మండలంలోని గుడిబండ చెందిన భగవంతు అనారోగ్యానికి గురై చనిపోవడంతో బాధిత కుటుంబాన్ని సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు. రూ.5వేలను మృతుని కుమారుడు దేవన్నకు అందించారు. అదేవిధంగా దుబ్బపల్లి చెందిన నాగిరెడ్డికి రూ.12వేల సీఎంఆర్‌ఎఫ్ ద్వారా వచ్చిన చెక్కును అందజేశారు. ఆయన వెంట శ్రీనివాస్‌రెడ్డి, జయన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలి

మిడ్జిల్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలని ఎస్టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాహెర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంతో పాటుగా వస్పుల, అయ్యవారిపల్లి, బోయిన్‌పల్లి, కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా తమ సంఘం బలపరిచిన అభ్యర్థి భుజంగరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో రవికుమార్, శ్రీశైలం, సుధాకర్, వెంకటయ్య పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు ఘన స్వాగతం



జడ్చర్ల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి సోమవారం పట్టణంలో ఘన స్వాగతం పలికారు.. మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తుండగా జాతీయరహదారిపై కావేరమ్మపేట వద్ద స్థానిక బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున పూలమాలలు, శాలువాలు వేసి స్వాగతం పలికారు. బైక్ ర్యాలీ నిర్వహిస్తూ మహబూబ్‌నగర్‌కు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో శాంతికుమార్, బాలత్రిపుర సుందరి ఉన్నారు.

భూత్పూర్: జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణగార్డెల్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి సోమవారం సాయంత్రం పట్టణంలో బైక్‌ర్యాలీ చేపట్టారు. నాయకులు సుదర్శన్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు, కార్యకర్తలు రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి స్వాగతం పలికేందుకు జడ్చర్లకు బైక్ ర్యాలీగా వెళ్లారు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్ వెళ్లినట్లు నాయకులు తెలిపారు.

బీఆర్‌ఎస్‌తోనే నిరుపేదలకు మేలు



మట్టి పాత్రల తయారీ కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆల, కలెక్టర్ వెంకట్రావ్

అడ్డాకుల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరుపేదలకు అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలంలోని నందిపేట, సంకలమద్ది, పోల్కంపల్లిలో సోమవారం ఆయన పర్యటించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మూసాపేట వద్ద మట్టి పాత్రల తయారీ కేంద్రానికి కలెక్టర్ వెంకట్రావ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. నందిపేటలో రూ.20లక్షలతో పంచాయతీ భవనం, రూ.5లక్షలతో సీసీరోడ్డు, రూ.5లక్షలతో వాల్మీకి భవన నిర్మాణానికి పనులను ప్రారంభించారు. నందిపేటకు చెందిన కృష్ణయ్యకు రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. తర్వాత సంకలమద్దిలో రూ.20లక్షలతో పంచాయతీ భవనం, రూ.5లక్షలతో అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. పోల్కంపల్లిలో రూ.20లక్షలతో పంచాయతీ భవనం, రూ.30లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు. సంకలమద్దిలో అనాథ పిల్లలకు ఎమ్మెల్యే అండగా నిలిచి వారి బాగోగులను చేసుకుంటానని హామీ ఇచ్చారు. తిమ్మాపూర్‌లో మరణించిన నర్సింహులు కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సర్కారుకు ప్రజలు అండగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఇంద్రయ్య సాగర్, ఎంపీపీ కళావతి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహ, రైతు బంధు సమితి అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంటలోనే కొనసాగించండి



బస్టాండ్ కూడలిలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

చిన్నచింతకుంట: తిర్మలాపూర్ గ్రామాన్ని చిన్నచింతకుంట మండలంలోనే కొనసాగించాలని గ్రామస్తులు సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సువర్ణరాజుకు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు ధనుంజయ్, జనార్దన్, పుట్ట అంజయ్య మాట్లాడుతూ మండలానికి సమీపంలోఉన్న తిర్మలాపూర్‌ను కొందరు ప్రజాప్రతినిధులు రాజకీయ సౌలభ్యం కోసం కొత్తగా ఏర్పడ్డ కౌకుంట్ల మండలంలో కలిపి గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. గ్రామ సమస్యల పరిష్కారంకు ఇబ్బందులు తలెత్తనున్నాయన్నారు. కార్యక్రమంలో శ్రీను, బాల్‌చందర్, రాములు, మధుసూదన్, బీజేపీ నాయకులు రాజు, రమేష్ పలువురు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి బకాయిలతో సహా చెల్లించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం కేసీఆర్ వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం అదనపు కలక్టర్ తేజాస్ నందులాల్ పవర్‌కు వినతిపత్రం సమర్పించారు. నీళ్లు, నిధులు నియామకాల కోసం ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో 1,200 మంది బలిదానం చేసుకున్నారన్నారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ నాటి నుంచి ఉద్యోగ నియామకాలు ఆశించిన స్థాయిలో లేవన్నారు. 2018 సాధారణ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.3,016 అందిస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారన్నారు. 2019 జనవరి నుంచి 2023 జనవరి దాకా ఒక్కో నిరుద్యోగికి రూ.1,47,784 వెంటనే అందజేయాలని అన్నారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సాయిబాబ, అబ్దుల్ హక్, మహమ్మద్‌సల్మాన్, తాహేర్, ఫహీం పాల్గొన్నారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం



గుంతలమయంగా ఉన్న రంగారెడ్డిపల్లి-పరిగి రోడ్డు

- ప్రారంభం కాని పనులు
- అధ్వానంగా రంగారెడ్డిపల్లి-పరిగి రోడ్డు
- అవస్థలు పడుతున్న రహదారులు

గండేడ్: నిధులు మంజూరై టెండర్ కూడా పూర్తయ్యింది. దాదాపు ఆరు నెలలు కావస్తున్నా రోడ్డు ఇప్పటి వరకు పనులు ప్రారంభం కావడం లేదు. ఫలితంగా వాహనదారులకు నిత్యం ఇక్కట్లు తప్పడం లేదు. మండలంలోని రంగారెడ్డిపల్లి నుంచి పరిగి వెళ్లే రహదారి ప్రధానమైంది. ఈ రోడ్డు పరిగితో పాటు బొంరాస్‌పేట్, చేవెళ్ల, మొయినాబాద్, హైదరాబాద్‌కు వెళ్లేందుకు మండల వాసులకు సులభంగా ఉంటుంది. దూరం తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. మండలం ఇంకా పరిగి నియోజకవర్గంలో ఉండడంతో ఆయా పనుల నిమిత్తం మండల వాసులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ఇది పరిగి ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉండగా రంగారెడ్డి జిల్లా నుంచి గండేడ్ మండలం వేరయ్యాక రంగారెడ్డిపల్లి నుంచి గుముడాల్‌తండా వరకు మహబూబ్‌నగర్ ఆర్‌అండ్‌బీ పరిధిలోకి వచ్చింది. అయితే దోమ మండలం దిర్సంపల్లి నుంచి డబుల్ రోడ్డు ఉన్నా రంగారెడ్డిపల్లి నుంచి దిర్సంపల్లి వరకు దాదాపు 18 కిలోమీటర్లు సింగిల్ రోడ్డే ఉంది. ఈ రోడ్డు గుంతలమయంగా ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మండలంలోని 6.7 కిలోమీటర్ల రోడ్డు ఉంది. ఇది మరీ దారుణంగా తయారైంది. అడుగడుగునా మోకాలి లోతు గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో అయితే వాహనదారులు పడరాని పాట్లు పడతారు. దాదాపు సంవత్సరం నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. ఇసుక ఎక్కువగా ఇదే రోడ్డు గుండా అక్రమ రవాణ చేస్తుండడంతో రోడ్డు మరింత అధ్వానంగా మారింది. రోడ్డు మరమ్మతు చేపట్టాలని పలుమార్లు ప్రజలు విన్నవించడంతో నిధులు మంజూరు చేశారు. కానీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనులకు గ్రహణం పట్టుకుంది.

నిధులు మంజూరైన ఆరు నెలలు..

ఈ రోడ్డు మరమ్మతు చేయడానికి రూ.1.3 కోట్లు ఆరు నెలల క్రితం నిధులు మంజూరు అయ్యాయి. టెండర్లు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. నిధులు మంజూరైన కొత్తలో వర్షాలు ఉన్నాయని తర్వాత ప్రారంభిస్తామని చెప్పారు. నెల రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పి, ఆరు నెలలు అయినా పనులు చేపట్టడం లేదు. ఈ రూట్లో బస్సు సౌకర్యం కూడా లేదు. దీంతో ఆటోలే ఈ ప్రాంత వాసులకు దిక్కయ్యాయి.

ఇబ్బందులు పడుతున్నాం..



మేము ఎక్కడికి వెళ్లాలన్నా ఇదే రోడ్డు దిక్కు. ఎన్నో రోజుల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కంకర తేలడంతో పాటు గుంతలు కూడా చాలా ఉన్నాయి. బైక్‌పై వెళ్లాలంటే కూడా నరకంగా ఉంది. బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలు సరిగ్గా రావడం లేదు. వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడ్డాం. తొందరగా పనులు చేపడితే ఇబ్బందులు ఉండవు.

– దోమ వెంకటయ్య, లింగాయిపల్లి

నోటీసులు ఇస్తాం..

రోడ్డు పనులు ప్రారంభించాలని చాలా సార్లు చెప్పాం. వేరే చోట పనులు నడుస్తున్నాయి అవి కాగానే చేస్తామని కాంట్రాక్టు వారు చెప్పారు. త్వరితగతిన పనులు చేపట్టాలని ఒత్తిడి తెస్తూనే ఉన్నాం. రెండు, మూడు రోజుల్లో కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇస్తాం. త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– రాములు, ఆర్‌అండ్‌బీ డీఈ